
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 111 వ భాగం

## పురంజనోపాఖ్యానం; పృధు చరిత్ర -4

పృధువు భూదేవిని శిక్షించడానికి పూనుకునేసరికి ఆవిడ చెప్పింది ఏమి చేయాలో, ఔషధులని బయటకి తీయడానికి. ఆ తర్వాత అవి బయటకి వచ్చాయనుకుందాం, ఏం చేయాలి వాటితో? అదే విషయం మరింతగా విశదీకరిస్తోంది. ఇదే భూమిని దున్నడం, నారుమడి వేయడం అనేటువంటి పనులు.

చ. మనుజవరేణ్య! యేను విషమస్థలినై యిపు డున్నదాన; నొ
య్యన జలదాగమోదిత పయః ప్రకరంబు తదాగమంబు వో
యినను దదంబువుల్ పుడమి నింకక యంతట నిల్చునట్లుగా
మనునిభ; నన్ను నిప్పుడు సమస్థలినై పెనుపొందఁ జేయవే. [ 4-498]

ఇప్పుడు చదునుగా లేకుండా విషమంగా ఉన్నాను (విషమ స్థలినై); అందువల్ల నేలమీద కురిసిన నీరు ఇంక కుండా అటూ ఇటూ పోతోంది. ఒకే చోట ఆ నీరు ఉండేలాగ చదును చేయించు (సమస్థలినై). మిగతావి వాటికవే సర్దుకుంటాయి కదా? దీని అర్ధం ఏమిటంటే, భూమిని సరిగ్గా దున్ని, అన్నీ సిద్ధంగా చేసుకుంటే రాజు మంచివాడైతే దొంగతనాలూ అన్నీ జరగడం తగ్గి వానలు సరిగ్గా కురుస్తాయి. తర్వాత పంటలు పండి జనం బాగుపడడానికి ఎంతో కాలం పట్టదు. ఇప్పుడు పృధు చక్రవర్తి చేసిన పనేమిటో చూద్దాం.

చ. మనువును దూడఁ జేసి గరిమన్ నిజపాణితలంబు లీల దో
హనముగఁ జేసి యందు సకలౌషధులం బిదికెం గ్రమంబునం
దనరఁగఁ దద్విధంబునను దత్పృథు వత్సలయైన భూమియం
దనయము వారువారును బ్రియంబగు కోర్కులు వొంది రున్నతిన్. [4-500]

మనువుని దూడగా, తన అరచేతిని (నిజపాణి తలంబు) పాత్రగా, తానే దోగ్ధగా భూమిని చదును చేసాక ఔషధులన్నింటినీ పిండాడు. అర్ధం అయింది కదా, తాను దగ్గిరుండి భూమిని దున్నించడం, పంటలు పండించడం చేయించాడన్నమాట. ఇదీ పద్ధతి అని స్వంతంగా చేసి చూపించాడు. ఇది చూసి మిగతావారు వారి కోర్కెలని బట్టి వారికి కావాల్సింది వారు పిండుకున్నారు. అంటే ఒకరు వరి వేస్తే మరొకరు మరో పంటా, మరొకరు కాయగూరలూ అలా అందరూ తలొకటీ ఎవరికి కావాల్సినవి వారు వేసుకున్నాక భూమి సస్యశ్యామలం అయిందనుకోవచ్చు. పృధువు ముందున్న రాజులకీ ఈయనకీ అదే తేడా. ముందున్న రాజులు అన్నీ పట్టించుకోవడం మానేసారు. భూసారం పోయింది. పంటలకి ఎవరికీ ఓపికా కోరికా తీరికా లేవు. అందువల్ల జనం చావడం మొదలైంది. అప్పుడు పృధువు పుట్టాక చేయాల్సింది తెల్సింది. అలా మరో సారి జీవితాలు బాగుపడడం మొదలైందన్నమాట. ఒక్కసారి జనజీవితాలు బగుపడగానే మిగతా విషయాలు అవే సర్దుకుంటాయ్. అంటే డబ్బులు చేతుల్లో ఆడడం మొదలవగానే యజ్ఞయాగాలు, వేదం చదువుకునేవారు, వడ్రంగి, కమ్మర్లూ, వర్తకులూ ఎవరికి కావాల్సినవి వారు మొదలుపెట్టారు. అన్నింటికీ భూమే కదా ఆధారం, దానినే భూమిలోంచి పిండుకున్నారు అని చెప్తున్నాడు ఇక్కడ.

సీ. బలసి ఋషుల్ బృహస్పతి వత్సకంబుగా–
నర్థించి తమ యింద్రియంబు లందు
నంచితచ్ఛందోమయక్షీరమును దేవ–
తలు సురరాజు వత్సంబు గాఁగఁ
గనక పాత్రము నందుఁ దనరు నోజోబల–
వీర్యామృతంబునై వెలయు పయసు
దైత్య దానవులు దైత్యశ్రేష్ఠుఁ డగు గుణ–
శాలిఁ బ్రహ్లాదు వత్సంబుఁ జేసి [4-501]

తే. ఘన సురాసవ రూప దుగ్ధంబు వరుస
నప్సరోజన గంధర్వు లలరి యపుడు
దనర విశ్వావసువు వత్సమునుగఁ జేసి
పద్మమయ నిర్మితంబైన పాత్రమందు [4-501.1]

ఋషులు బృహస్పతిని దూడగా చేసుకుని వేదాలని అభ్యసించడం మొదలుపెట్టారు. అలా వాళ్ళకి అందినది వేదమయమైన క్షీరం (పాలు). దేవతలకి ఓజో, బల, వీర్యాలు కలిగించే క్షీరం, దానవులకి సురాసవ రూపమైన క్షీరం అలా ఎవరిక్కావాల్సినవి వారికి దక్కాయి. సురాసవ రూపమైన క్షీరం అంటే మత్తు కలిగించేది. దీని గురించి ముందొకసారి చూశాం కూర్మావతారంలో. పాలసముద్ర మధనంలో బయటకి వచ్చిన వారుణి తెచ్చిన పాత్రలో ఉండేది ఈ పదార్ధమే – సురాసువ రూపమైన క్షీరం. ఇదే పంటలు బాగా పండితే అందరికీ కలిసి రావడం అంటే.

వ. మాధుర్య సౌందర్య సహిత గాంధర్వక్షీరంబును బిత్రుదేవతలు సూర్య వత్సకంబుగా నామ పాత్రంబునందుఁ గవ్యం బను దుగ్ధంబును, సిద్ధులు గపిల వత్సకంబుగా నాకాశ పాత్రమందు సంకల్పనారూపాణిమాది సిద్ధి యను క్షీరంబును, విద్యాధరాదులు తద్వత్సకంబును దత్పాత్రకంబునుంగా ఖేచరత్వాది వ్యాపారరూప క్షీరంబును, గింపురుషాదులు మయవత్సకంబును నాత్మ పాత్రంబునుంగా సంకల్పమాత్ర ప్రభవంబు నంతర్ధానాద్భుతాత్మ సంబంధియు నగు మాయ యను క్షీరంబును, యక్షరక్షోభూత పిశాచంబులు భూతేశ వత్సకంబుఁ గపాల పాత్రంబునుంగా రుధిరాసవం బను క్షీరంబును, నహిదందశూక సర్ప నాగంబులు దక్షకవత్సంబును బిలపాత్రంబునుంగా విషరూప క్షీరంబును, బశువులు గోవృషవత్సకంబు నరణ్య పాత్రంబునుంగాఁ దృణం బను క్షీరంబును, గ్రవ్యాదమృగంబులు మృగేంద్ర వత్సకంబును నాత్మ కళేబర పాత్రకంబునుంగాఁ గ్రవ్యం బను దుగ్ధంబును, విహంగంబులు సుపర్ణవత్సకంబుగా నిజకాయ పాత్రంబునుంగాఁ గీటకఫలాదికం బను దుగ్ధంబును, వనస్పతులు వటవత్సకంబుగా భిన్నరోహరూప పయస్సును, గిరులు హిమవద్వత్సకంబును నిజసాను పాత్రకంబునుంగా నానాధాతువులను, దుగ్ధంబునుంగా నివ్విధంబున సమస్త చరాచర వర్గంబు స్వముఖ్యవత్సకంబును స్వస్వపాత్రకంబునుంగా భిన్నరూపంబు లైన క్షీరంబులం బిదికె" నని చెప్పి మఱియును.

[4-502]

ఈ వచనంలో భూదేవి పంటలు సరిగ్గా పండించడం మొదలయ్యాక ఎవరి ఎవరికి ఏమి దొరికాయో చెప్తున్నారు. గంధర్వులు చేసేది పాటలు పాడడం అవీ కనక వాళ్ళకి మాధుర్య సౌందర్య సహిత గాంధర్వక్షీరం, పంటలు బాగా పండి కడుపులు నిండితే జనం పితృదేవతలకి సరిగ్గా కర్మలు చేయడం మొదలుపెడతారు కనక వాళ్లకి కవ్యమనే క్షీరం, సిద్ధులకి సంకల్పనారూపాణిమాది సిద్ధి యను క్షీరం (సంకల్ప మాత్రం చేత రూపం, అణిమాది సిద్ధులు కలిగే కోరిక), నాగులకి విషం అనేది వృద్ధి పొందింది. పశువులకి తృణం (గడ్డి) అనే క్షీరం, పక్షులకి క్రిమికీటకాలనే క్షీరం (తిండి), అలా ఎవరికి కావాల్సినవి వారికి లభించాయి. ఈ వచనంలో క్షీరం అంటే అన్ని అర్ధాలలో పాలు కావనీ, ఎవరికి కావాల్సిన కోరికలని

వాళ్ళు సంపాదించుకోగలిగారనీ చూడవచ్చు. ఇదంతా ఎప్పుడు జరుగుతుందంటే భూమిమీద పంటలు సరిగ్గా పండడం మొదలయ్యాక. అదే పృథు చక్రవర్తి చేసినపని. భూమిని చదును చేయించి, దగ్గిర ఉండి చేయించాడు ఇదంతా. అలా వేనుడితో మొదలైన దరిద్రం వదిలింది రాజ్యానికి.

క. క్రమమున నిటు పృథ్వాదులు
దమతమ కామితము లనఁగఁ దగు భిన్నక్షీ
రము దోహన వత్సక భే
దమునం దగఁ బిదికి; రంత ధరణీధవుఁడున్. [4-503]

తే. సముచితానందమును బొంది సర్వకామ
దుఘ యనం దగు భూమిని దుహితఁగాఁగఁ
గోరి కైకొని నిజధనుఃకోటిచేత
భూరిగిరి కూటములఁ జూర్ణములుగఁ జేసి. [4-504]

అలా క్రమక్రమంగా మొత్తానికి భూమి అంతటినీ సాగులోకి తెచ్చాడు. భూమిని అలా చేసాక ఆవిడని తన కూతురిగా స్వీకరించాడు. తనవల్లే కదా మొత్తం రాజ్యం బాగుపడింది, అందువల్లే. ఎక్కడికక్కడ పనికిరాని పర్వతాలు అవీ ఉంటే వాటిని తొలగించి చదును చేయించాడు – మొదట్లో భూదేవి చెప్పినట్టుగానే.

తే. చండ దోర్దండలీల భూమండలంబు
సమతలంబుగఁ జేసి శశ్వత్ప్రసిద్ధి
నొంది యవ్విభుఁ డీ లోకమందు నెల్ల
ప్రజకుఁ దండ్రియు జీవనప్రదుఁడు నగుచు. [4-505]

అలాచేస్తే ఏమౌతుంది? ఎవరిక్కావాల్సిన వృత్తుల్లో వాళ్ళు స్థిరపడ్డారు. రాజు వల్ల ఇదంతా జరిగింది కనక ఆయన ప్రజలకి జీవనప్రదుడయ్యాడు. బాగా పేరు సంపాదించాడు దీనివల్ల పృథుచక్రవర్తి.

తే. అక్క డక్కడఁ బూర్వంబునందు లేని
గ్రామ పట్టణ దుర్గ ఖర్వట పుళింద
ఖేట శబరాలయవ్రజ వాట ఘోష
వివిధ నిలయము లర్థిఁ గావించె నంత. [4-506]

పంటలు బాగా పండుతున్నాయి. ఎవరి విహిత కర్మలు వాళ్ళు ఆచరించడం మొదలైంది. అందువల్ల గ్రామాలు, పట్టణాలు, రాజుగారి కోటలూ (దుర్గాలు), అలా అన్నీ బాగుపడ్డం మొదలైంది.

క. వారును భయవిరహితులై
బోరనఁ దత్తన్నివాసముల యందు సుఖ
శ్రీరుచి నొప్పుచు నుండిరి
వారక యా పృథునిఁ బొగడ వశమె ధరిత్రిన్? [4-507]

జనం ఒకప్పుడు వేనుడు రాజుగా ఉన్నప్పుడు కలిగిన భయాలన్నీ మర్చిపోయి, సుఖంగా బతకడం మొదలైంది. ఇంతవరకూ జరిగింది చూస్తే తెల్సేది ఇదే. ధృవుడి తర్వాత వచ్చిన వేనుడి రాజ్యంలో అధర్మం పెరిగి జనం పంటలూ, అవే వేయడం మానేసారు. అదంతా తమ మీదకి తిరిగి వచ్చి పడేసరికి అనేకానేక ఏళ్ళు గడిచాయి. జనం అసలు పంటలంటే ఏమిటి, అవెందుకూ అనేవి మర్చిపోయారు. భూదేవి వట్టిపోయిన ఆవులా తయారైంది. అసలే తిండిలేక అల్లల్లాడుతూన్న జనం చావడం మొదలైంది – తిండికీ కూడుకీ బట్టకీ ఏమీ లేదు. చేతిలో ఏమిలేనప్పుడు వేదాధ్యయనం లాంటి చదువులూ, పితృకర్మలూ, ఆటలూ పాటలూ గానం, అవీ ఏమీ చేయలేరు కదా? అప్పుడు పుట్టిన పృధువుకి ఏమి చేయాలో తెల్సింది. మరోసారి భూమిని చదును చేయించి పంటలు వేయించడం మొదలుపెట్టాడు. క్రమంగా అన్నీ మళ్ళీ గాడిలో పడ్డాయన్నమాట. ఇదే భూమిని గోవుగా చేసి ఔషధులని పిండడం అంటే. అటువంటి పృధు చక్రవర్తిని పొగడగలమా అంటున్నాడు శుకమహర్షి.

వ. మఱియుం బరమ భాగవత సేవితుండును నారాయణాంశ ప్రభవుండును నైన పృథుచక్రవర్తికి భూమి హవిరాదిదోగ్ధ్రి యయ్యును సర్వకామదుఘయై సమస్త పదార్థంబులం బిదుకుచుండె; మఱియుఁ దరువులు ఘనతరాకారంబులు గలిగి మకరంద స్రావు లగుచు నిక్షుద్రాక్షాది రసంబులును దధిక్షీరాజ్య తక్ర పానకాదికంబులును వర్షింప నవి యెల్ల నదులు

వహించె; సముద్రంబులు హీరాది రత్న విశేషంబుల నీనుచుండె; పర్వతంబులు భక్ష్య భోజ్య లేహ్య చోష్యంబు లను చతుర్విధాన్నంబులు గురియుచుండె; లోకపాల సమేతులైన సకల జనంబులు నుపాయానంబులు దెచ్చి యిచ్చుచుండి; రిట్టి పరిపూర్ణ విభవాభిరాముండై యధోక్షజసేవాపరాయణుండగు పృథుచక్రవర్తి యేకోనశతాశ్వమేధంబులు సన్మేధంబునం గావించి నూఱవ యాగంబునందు యజ్ఞపతి యైన పుండరీకాక్షుని యజించుచుండం దదీయ పరమోత్సవంబు సహింపం జాలక. [4.510]

అలా భూమినుంచి కావాల్సినవి సమకూరేసరికి రాజ్యంలో చెట్లూ చేమలూ బాగా పెరుగుతూ తేనె, పళ్ళూ ఫలాలూ ఇవ్వడం మొదలుపెట్టాయి. ఆ తర్వాత జరిగేది జగద్విదితం. నదులు బాగా ప్రవహించడం మొదలైంది. పాలు పెరుగూ, నెయ్యీ (తక్రం) అనేవి రాజ్యంలో కొరతలేకుండా పారాయి. భక్ష్య భోజ్య లేహ్య చోష్యం అనే నాలుగు విధాల భోజనం పుష్కలంగా లభించడం మొదలైంది. అప్పుడు నారాయణాంశ తో పుట్టిన పృధు చక్రవర్తి ఒక్కొక్కటిగా అశ్వమేధాలు చేయడం మొదలుపెట్టాడు. అవి తొంభై తొమ్మిది (ఏకోనశత – వందకి ఒకటి తక్కువగా) పూర్తయ్యాక నూరో యజ్ఞం మొదలౌతుంటే ఇంద్రుడికి దడ పుట్టుకొచ్చింది.

నూరు యజ్ఞాలు చేసిన ఎవరైనా ఇంద్రుడు అవడానికి అర్హుడు కదా, అందుకే ఆయనకి దడ. మొదట్లో పృధువు పుట్టినప్పుడు ఇంద్రుడు వచ్చి దీవించి కిరీటం ఇచ్చాడు ఈ పుట్టిన పృధువు నారాయణాంశ సంభూతుడు అని తెలిసి. కానీ ఇప్పుడు పృధువు నూరో అశ్వమేధం చేయడం మొదలుపెట్టేసరికి కంగారు మొదలైంది. మాయ అంటే ఇదే. దీన్ని భగవంతుడి సేవతో ఆయన వలన మాత్రమే మాయ తప్పించుకోవడం కుదురుతుంది కానీ – ఇంద్రుడితో సహా ఎవరికీ కూడా – మరోదారి లేదు. ఇలా తన పదవి పోతుందనే కోపం వచ్చిన ఇంద్రుడు ఏం చేసాడో, తర్వాత ఏమౌతుందో వచ్చే నెల వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS